క్లుప్తంగా

ముగిసిన టెన్త్ పరీక్షలు

నాదెండ్ల: పదో తరగతి పరీక్షలు శనివారంతో ముగిశాయి. ఈ నెల 3న ప్రారంభమైన పరీక్షలు మండలంలో మూడు పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగాయి. సాతులూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 237 మంది విద్యార్థులకు గాను ఇరువురు గైర్హాజరు కాగా, నాదెండ్లలో 116 మందికి నూరుశాతం, చిరుమామిళ్ళ నడికట్టు రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 192 మందికి నూరుశాతం హాజరయ్యారు. ఫ్లయింగ్ స్క్వాడ్ అప్పిరెడ్డి సాతులూరు పరీక్షా కేంద్రాన్ని పరిశీలించారు. పోలీసులు మూడు కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించారు. చీఫ్ సూపరింటెండెంట్‌లుగా బొడ్డు శ్రీనివాసరావు, విజయభారతి, జానకీధర్ వ్యవహరించారు. పరీక్షలు ముగియటంతో విద్యార్థుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

వైభవంగా లక్ష్మీగణపతి ఆలయ వార్షికోత్సవం



నాదెండ్ల: గణపవరం గ్రామంలో కుప్పగంజి వాగు సమీపంలో కొలువైయున్న శ్రీ లక్ష్మీ గణపతి ఆలయ రెండో వార్షికోత్సవాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారిని ప్రత్యేకంగా అలంకరించి పంచామృతాలతో చందనాది సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. గోత్రనామ పూజలు, సహస్ర నామార్చన, మంత్రపుష్పం నిర్వహించారు.గణపతిపూజ, మండపారాధన నిర్వహించారు. శ్రీ లక్ష్మీగణపతి శ్వేతార్క గణపతులకు తెల్ల జిల్లేడు, దేవతా హోమాలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్‌దీపాలతో అలంకరించారు. రాత్రికి విద్యుత్ ప్రభను ఏర్పాటు చేసి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీపద్మావతి గోదాదేవి సమేత శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు గ్రామస్తుల సహకారంతో ఘనంగా ముగిసినట్లు ఆలయ ధర్మకర్త చైర్మన్ మక్కెన రామకృష్ణ–సుబ్బాయమ్మ దంపతులు శనివారం తెలిపారు. ఈసందర్భంగా ఆలయ పూజారి కొడవటికంటి మోహనరంగాచార్యులు, వేదపండితులు దిట్టకవి గోపాలచార్యులు సారధ్యంలో బ్రహ్మోత్సవాల చివరిరోజు స్వామివారికి పూర్ణాహుతి, చక్రాస్నానం, మండలిపూజ తదితర కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. స్వామి వారిని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఇచ్చిన ప్రతి హామీ ప్రభుత్వం అమలు చేసింది

- జగనన్న పాలనలో అన్ని వర్గాలకు మేలు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని



స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావిస్తూ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని కోరారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని పట్టణంలోని 37వ వార్డులో శనివారం నిర్వహించారు. మంత్రి విడదల రజిని ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న తీరు వివరిస్తూ, ఏ ఇంటికి ఏ పథకం ద్వారా లబ్ధి చేకూరిందో వివరిస్తూ, స్థానికుల సమస్యలు సైతం వింటూ వాటికి పరిష్కారాలను సంబంధిత అధికారులకు తెలుపుతూ కార్యక్రమం కొనసాగించారు.

ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమ పథకాలను కులం, ప్రాంతం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన పేదలందరికి అందజేస్తున్నదని వివరించారు. సామాజిక తనిఖీల ద్వారా లబ్ధిదారులను పారదర్శకంగా ఎంపిక చేసి వారికి ఆయా పథకాలను అందజేస్తున్నదని వివరించారు. రాష్ట్ర చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న ఘనత ఏపీకి మాత్రమే దక్కుతుందన్నారు. ప్రజల కష్టాలు తెలిసిన నేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజలు చేసుకున్న అదృష్టమని వెల్లడించారు. వార్డు, గ్రామ సచివాలయాలు, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అవినీతికి ఆస్కారం లేని విధంగా పథకాలను అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పథకాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించటమే లక్ష్యంగా గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహిస్తున్నట్లు వివరించారు. సంక్షేమ పథకాల ద్వారా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి నగదు జమ చేస్తూ పేద, మధ్యతరగతి కుటుంబాలకు ప్రభుత్వం ఎంతో భరోసా కల్పిస్తున్నదని వెల్లడించారు. మరోవైపు నాడు–నేడు వంటి కార్యక్రమాలతో ప్రభుత్వ పాఠశాలలు, ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దుతూ సంక్షేమంతో పాటు అభివృద్ధికి బాటలు వేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ తలహాఖాన్, వార్డు ఇన్‌చార్జి కిలారు అశోక్, వార్డు అధ్యక్షుడు కామేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యానికి పూర్తిస్థాయి భరోసా

చిలకలూరిపేట: ప్రజల ఆరోగ్యానికి పూర్తి స్థాయి భరోసా కల్పిస్తున్న ప్రభుత్వం తమదని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖా మంత్రి విడదల రజిని చెప్పారు. నియోజకవర్గ పరిధిలో వివిధ జబ్బులకు చికిత్స పొందిన 24 మందికి రూ. 32.10 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను శనివారం మంత్రి పంపిణీ చేశారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 3,255 చికిత్సలను ప్రభుత్వం ఉచితంగా అందజేస్తున్నదని చెప్పారు.

నూతన జీవితాన్నివ్వడం అభినందనీయం

- 10 మంది పిల్లలకు కాంక్లియార్ సర్జరీలు
- ఆరంభించిన జిల్లా కలెక్టర్ శివశంకర్, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి



సర్జరీలు చేయించుకున్న పిల్లలు, వారి తల్లిదండ్రులకు మెషీన్లను అందజేస్తున్న కలెక్టర్

నరసరావుపేట: మూగ, చెవుడుతో పుట్టిన పదిమంది పిల్లలకు కాక్లియార్ ఇంప్లాంట్ సర్జరీ ద్వారా వారి జీవితాల్లో వెలుగులు నింపిన డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ నిర్వాహకులు అభినందనీయులని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్, జిల్లా ఎస్పీ వై.రవిశంకర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సత్తెనపల్లిరోడ్డులోని డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ ఆవరణలో నిర్వహించిన కాక్లియార్ ఇంప్లాంట్ సర్జరీచేసిన పిల్లలకు మెషీన్లు అమర్చే ప్రక్రియ ప్రారంభోత్సవానికి వారిద్దరూ వేర్వేరు సమయాల్లో హాజరై విలేకర్లతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఒకేసారి పది మంది మూగ, చెవుడు పిల్లలకు కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీలు చేయటం పల్నాడు జిల్లాకే గర్వకారణమన్నారు. సర్జరీలు చేసిన డాక్టర్ రాజేష్ వైద్య బృందం, డాక్టర్ అంజిరెడ్డి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ లోకిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. జిల్లా ఎస్పీ వై. రవిశంకర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ఈ పది మంది పిల్లలకి ఈ కాక్లియర్ ఇంప్లాంట్ అమర్చి వారి జీవితాల్లో నూతన వెలుగులు అందజేయటం ఎంతో సంతోషకరమన్నారు. పల్నాడు జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ చైర్మన్ మిట్టపల్లి రమేష్, ఏపీవీవీపీ డీసీహెచ్ఎస్ డాక్టర్ రంగారావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వాటర్ కూలర్ ఆరంభం



వాటర్ కూలర్‌ను ప్రారంభిస్తున్న న్యాయమూర్తి శోభారాణి, న్యాయమూర్తులు, న్యాయవాదులు

నరసరావుపేట: కోర్టు ఆవరణలోని ప్లీడరు గుమస్తాల సంఘ కార్యాలయంలో గుమస్తాల కోసం దివంగత సీనియర్ న్యాయవాది కాకుమాను సూర్యనారాయణరెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు, జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కాకుమాను బాల హనుమంతారెడ్డి వోల్టాస్ కంపెనీ వాటర్‌కూలర్ బహూకరించారు. దీనిని శనివారం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి శోభారాణి ప్రారంభించారు. కార్యక్రమంలో అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి మధుస్వామి, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి దేవేందర్ రెడ్డి, జూనియర్ సివిల్ జడ్జి జే.అంజయ్య పాల్గొన్నారు. సీనియర్ న్యాయవాదులు కట్టా నారపరెడ్డి, అలెగ్జాండర్ సుధాకర్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఎం.సుభాణిని, ఎం.సుబ్బారావు, గంటా రాజేష్, ప్రసన్నకుమార్, గుమస్తాల సంఘం అధ్యక్షుడు పులి రాజు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖ తనిఖీలు

బొల్లాపల్లి: మండలంలోని రేమిడిచర్ల సెక్షన్ పరిధిలో అక్రమ విద్యుత్ కనెక్షన్లపై ఆ శాఖ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 34 బృందాలు పాల్గొన్నాయి. ఈ దాడుల్లో 1067 సర్వీసులు తనిఖీ చేసి రూ.1.93 లక్షల అపరాధ రుసుం విధించారు. ఈ మేరకు గుంటూరు విజిలెన్స్ ఈఈ విజయకృష్ణ, నరసరావుపేట ఆపరేషన్ ఈఈ ఎస్. శ్రీనివాసరావు దాడుల్లో పాల్గొని వివరాలు వెల్లడించారు.

ఆర్బీకేల్లో మొక్కజొన్న కొనుగోళ్లు

ఈపూరు: మండలంలోని గ్రామాల్లో రైతులు పండించిన మొక్కజొన్న పంటలను రైతు భరోసా కేంద్రాల్లో కొనుగోలు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి ఆర్. రామారావు శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట కొనుగోలుకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆర్బీకేల్లో ప్రారంభమైందని, ఈ–క్రాప్ బుకింగ్ చేసుకున్న రైతులు పంటను విక్రయించాలనుకునేవారు ఆర్బీకేల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ ఉద్యాన సహాయకులు వద్దకు వెళ్లి పేర్లు నమోదు చేయించుకోవాలన్నారు. మార్క్‌ఫెడ్ వారి దగ్గర అప్రూవల్ అయిన తరువాత నుండి వచ్చిన రైతు సోదరులకు నేరుగా మెసేజ్ పంపిస్తారని, ఈ మెసేజ్‌లోనే ఏ రోజు పంటను కొనుగోలు చేస్తారో తెలియజేస్తారని వివరించారు. ప్రభుత్వం మద్దతు ధర ఒక క్వింటాకు రూ.1962గా నిర్ణయించారని తెలియజేశారు. కావున రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు.

నమోదు తప్పనిసరి

శావల్యాపురం: మొక్కజొన్న పంటను సాగు చేసిన అన్నదాతలు ఆయా గ్రామాల్లోని పరిధిలో రైతు భరోసా కేంద్రాల్లో సమగ్ర వివరాలతో తమ పేర్లు నమోదు చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు శనివారం తెలిపారు. రైతుభరోసా కేంద్రాల వివరాలు నమోదు చేసుకున్న రైతులకు తమ సెల్‌ఫోనుకు సందేశం రాగానే మార్క్‌ఫెడ్ వారు తక్షణమే కొనుగోలు చేస్తారన్నారు. ప్రభుత్వ మద్దతూ ధర క్వింటా రూ.1962లకు కొనుగోలు చేస్తామన్నారు. మండలంలోని 15 గ్రామ పంచాయతీలో 4 వేల ఎకరాలు మొక్కజొన్న పంటను ఈఏడాదిలో సాగు చేశారన్నారు. అకాల వర్షం దాటికి మొక్కజొన్న పంట పడపోవటంతో గింజలు రంగు మారటంతో వాటిని కొనుగోలు చేస్తామన్నారు. మొక్కజొన్న పంట ఎకరానికి 30 నుంచి 40 క్వింటాల వరకు దిగుబడులు రావటంతో రైతులు ఆనందంలో ఉన్నట్లు ఏవో తెలిపారు.

విద్యుత్ తీగలు రాసుకుని..

- ఎండుగడ్డి, పిచ్చిమొక్కలు దగ్ధం
- మంటల్ని అదుపులోకి తెచ్చిన అగ్నిమాపక సిబ్బంది



మంటల్ని ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

యడ్లపాడు: స్తంభాలపై వదులుగా ఉన్న విద్యుత్ తీగలు ఈదురు గాలులకు రాచుకోవడంతో రేగిన నిప్పు రవ్వలు గడ్డి, పిచ్చిమొక్కలపై పండి మంటలు రేగిన సంఘటన యడ్లపాడు మండలం బోయపాలెం గ్రామంలో శనివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... బోయపాలెం 16వ నంబర్ జాతీయ రహదారి పక్కనే ఉన్న సక్కు నూలు మిల్లు సమీపంలో ఉన్న విద్యుత్ తీగలు గాలులకు రాచుకుని నిప్పురవ్వలు కిందకు వచ్చి పడ్డాయి. దీంతో పిచ్చిమొక్కలు, ఎండుగడ్డికి అంటుకుని భారీ మంటలు వ్యాపించాయి. స్థానికుల సమాచారంతో అప్రమత్తమైన పంచాయతీ అధికారులు చిలకలూరిపేట అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటల్ని అదుపులోకి తీసుకురావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. లేకుంటే సమీపంలోనే నూలుమిల్లు, అలాగే సుగాలీల గుడిసెలు ఉండటంతో ఏమాత్రం గాలి వీచినా భారీ ప్రమాదం జరిగి ఉండేదని స్థానికులు చెబుతున్నారు.

ప్రమాదాన్ని పసిగట్టాలి



వినుకొండ టౌన్ : అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలపై సిబ్బందికి, ప్రయాణికులకు స్థానిక రైల్వే స్టేషన్ ఆవరణలో అగ్నిమాపక శాఖ అధికారులు అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా ఆర్టీసీ బస్టాండ్, సురేష్ మహల్, ఆర్టీసీ గ్యారేజీ ప్రాంతాలలో అవగాహన నిర్వహించారు. ఐసిఎస్ఎఫ్ ఎం. శ్రీనివాసరావు, డీఓపీ రమణారెడ్డి, ఎల్ఎఫ్‌లు డి. ప్రకాష్ రావు, ఎ. వెంకటేశ్వర్లు, ఎఫ్ఎంలు పాల్గొన్నారు.

నేడు వాసవీ మిత్రమండలి వార్షికోత్సవం

నరసరావుపేట ఈస్ట్: శ్రీవాసవీ మిత్రమండలి దశమ వార్షికోత్సవ ఈనెల 16వతేదీ ఆదివారం శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలోని వేంకటేశ్వర కళ్యాణమండపంలో నిర్వహిస్తున్నట్లు మిత్రమండలి అధ్యక్షుడు చేగు వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు. వేడుకలలో భాగంగా 27మందికి విశిష్ట సేవా పురస్కారాలు, పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, జిల్లా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ మిట్టపల్లి రమేష్, జిల్లా ఉన్నతాధికారులు హాజరవుతారని తెలిపారు.